సాక్షి
చిత్తూరు
సోమవారం ၊ 21 ၊ ఏప్రిల్ ၊ 2025



సెప్టిక్ ట్యాంక్ క్లీన్ చేస్తూ కూలీ మృతి

పుంగనూరులో ఓ ఇంటి సెప్టిక్ ట్యాంకును ఇద్దరు కూలీలు శుభ్రం చేస్తుండగా ఊపిరాడక ఒకరు మృతి చెందారు. - 8లో



కిక్కిరిసిన బోయకొండ

చౌడేపల్లి మండలంలోని బోయకొండ గంగమ్మ ఆలయం ఆదివారం భక్తుల తాకిడితో కిక్కిరిసిపోయింది. - 8లో



అగ్నిప్రమాదంలో ఇల్లు దగ్ధం

పుత్తూరు మండలంలోని కృష్ణసముద్రంలో ఆదివారం విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో పెంకుటిల్లు దగ్ధమై ఆస్తి నష్టం వాటిల్లింది. - 8లో

న్యూస్‌రీల్

నేడు పలమనేరులో ప్రజాసమస్యల పరిష్కార వేదిక



సుమిత్ కుమార్, కలెక్టర్

చిత్తూరు కలెక్టరేట్ : ప్రజల సమస్యల పరిష్కారం కోసం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్‌ఎస్) సోమవారం పలమనేరు ఆర్డీఓ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు కలెక్టర్ సుమిత్ కుమార్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పలమనేరు ఆర్డీఓ కార్యాలయంలో ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ప్రజలు తమ సమస్యలను వినతుల రూపంలో అందజేయాలని కోరారు.

నేడు పోలీసు గ్రీవెన్స్

చిత్తూరు అర్బన్ : చిత్తూరు నగరంలోని వన్ టౌన్ పక్కన ఉన్న ఆర్మ్డు రిజర్వు (ఏఆర్) కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (గ్రీవెన్స్‌డే) కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎస్పీ మణికంఠ చందోలు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు వారి సమస్యలు ఏవైనా ఉంటే తనను నేరుగా కలిసి మాట్లాడొచ్చన్నారు. ఉదయం 10.30 గంటల నుంచి ఇక్కడ ఇచ్చే వినతులు, ఫిర్యాదులను పరిశీలించి చర్యలు చేపడుతామని ఎస్పీ తెలిపారు.

ముఖ్యమంత్రా..మజాకా!

– సీఎం జన్మదినం.. ప్రత్యేక పూజలకు ఉత్తర్వులా?



ప్రత్యేక పూజల్లో నేతలు

కాణిపాకం : హవ్వా..నవ్విపోదురుగాక నాకేంటి అనే చందంగా మారింది కూటమి పరిస్థితి.. సీఎం జన్మదినానికి..ప్రత్యేక పూజలకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడంపై ఆధ్యాత్మికవేత్తలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వివరాలు ఇలా.. సీఎం చంద్రబాబు జన్మదిన వేడుకలను పురస్కరించుకుని ఆదివారం కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయకస్వామి దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే ప్రత్యేక గణపతి హోమం చేశారు. ఎమ్మెల్యే మురళీ మోహన్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, అన్నదానం చేశారు. అయితే సీఎం జన్మదిన వేడుకలను పురస్కరించుకుని ప్రత్యేక పూజల కోసం ఉత్తర్వులు జారీ చేయడం కాణిపాకంలో చర్చనీయాంశంగా మారింది. ఆలయ చరిత్రలో ఇలాంటి ఉత్తర్వులు ఎప్పుడూ లేదంటూ కాణిపాక గ్రామస్తులు, ఉభయదారులు, భక్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

అంగన్‌వాడీల యాప్‌సోపాలు



పనిచేయని బాల సంజీవని 2.0 యాప్

అంగన్‌వాడీల న్యాయమైన డిమాండ్లు, వారు ఎదుర్కొంటున్న సమస్యలన్నింటినీ పరిష్కరిస్తామని ఎన్నికల ముందు టీడీపీ హామీలు గుప్పించింది. ప్రభుత్వం కొలువుదీరి 11 నెలలు అవుతున్నా హామీలు అమలు చేయకపోగా కొత్త యాప్‌ల పేరుతో అంగన్‌వాడీలపై పనిభారం పెంచి ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. యాప్‌ల నిర్వహణ, సాంకేతిక సమస్యలు పరిష్కరించకుండా అమలు చేయడంతో క్షేత్ర స్థాయిలో అంగన్‌వాడీలు ఇబ్బందులు పడుతున్నారు. యాప్‌ల కారణంగా ఆలస్యంగా వచ్చిన చిన్నారులకు అన్నం పెట్టలేని దుస్థితి దాపురించిందని అంగన్‌వాడీలు ఆందోళన చెందుతున్నారు.

- పనిచేయని బాలసంజీవని 2.0
- పూర్వప్రాథమిక విద్య బలోపేతం పేరుతో పనిఒత్తిళ్లు
- సాంకేతిక సమస్యలు పరిష్కరించకుండా కొత్త యాప్‌లు
- పనిచేయని ఫోన్లు వెనక్కి ఇచ్చేందుకు సిద్ధమవుతున్న కార్యకర్తలు
- సెల్‌ఫోన్ల స్థానంలో ట్యాబ్‌లు ఇవ్వాలని డిమాండ్

కార్వేటినగరం : అంగన్‌వాడీ కేంద్రాల నుంచి గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు రేషన్ సరుకులను మరింత పకడ్బందీగా పంపిణీ చేయాలని ప్రభుత్వం యాప్‌లో మార్పులు, చేర్పులు చేసింది. అప్పటి నుంచి అంగన్‌వాడీలకు కష్టాలు మొదలయ్యాయి. ప్రభుత్వం ప్రవేశపెట్టిన యాప్‌లు మొబైల్ ఫోన్లలో ఇన్‌స్టాల్ కాక అంగన్‌వాడీలు అవస్థలు పడుతున్నారు. యాప్‌ల నిర్వహణలో ఉన్న సమస్యలను పరిష్కరించకుండా గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు సరుకులు పంపిణీ చేయాలని ఒత్తిడి చేస్తుండటంతో అంగన్‌వాడీ కార్యకర్తలు ఆందోళన చెందుతున్నారు.

గత ప్రభుత్వంలో పకడ్బందీగా సేవలు

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అంగన్‌వాడీ కేంద్రాల్లో స్మార్ట్‌ఫోన్ల వినియోగంతో పకడ్బందీగా సేవలు అందాయి. ఆరు యాప్‌లు అమలు చేసి పారదర్శకతకు పెద్దపీట వేసింది. పోషణ ట్రాకర్ యాప్, వైఎస్సార్ సంపూర్ణ పోషణ యాప్, హాట్‌కుక్ యాప్ తదితర యాప్‌లతో ప్రభుత్వం నిత్యం పర్యవేక్షించింది. అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారుల, గర్భిణులు, బాలింతలకు తాగునీరు, మరుగుదొడ్లకు సంబంధించి వినియోగించుకునేందుకు నీరు అందుబాటులో ఉంచింది, లేనిది యాప్ వివరాలు నమోదు చేస్తే ఆర్‌డబ్ల్యూస్ శాఖ అధికారులు యుద్ధ ప్రాతిపదికన నీటి సమస్య పరిష్కరానికి చర్యలు తీసుకునేలా కృషి చేసింది. గుడ్ల సరఫరాకు ప్రత్యేక యాప్ అందుబాటులోకి తెచ్చి అమలు చేసింది.

ప్రభుత్వం తాజాగా బాలసంజీవని 2.0 వెర్షన్‌తో కొత్త యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది.ఈ యాప్‌లో వర్కర్లు, హెల్పర్లు ఫొటో క్యాప్చర్ చేసి గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారం పంపిణీ చేయాల్సి ఉంది. అయితే తరచూ సాంకేతిక సమస్యలు తలెత్తుతుండడంతో అంగన్‌వాడీలు పోషకాహార పంపిణీలో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. కొత్తగా అమల్లోకి వచ్చిన యాప్ సక్రమంగా పనిచేయకపోవడంతో కూటమి ప్రభుత్వం అంగన్‌వాడీ వ్యవస్థను నిర్వీర్యం చేసేందుకు కుట్ర పన్నుతోందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఒక్కో పనిని మూడు యాప్‌ల్లో వివరాలు అప్‌లోడ్ చేయాల్సి ఉండటం, యాప్‌లో సాంకేతిక లోపం కారణంగా పనిచేయకపోవడంతో అవస్థలు పడుతున్నారు.

హాజరు ఇలా.. భోజనం ఎలా?

ప్రతి రోజు విధిగా ఉదయం 9 గంటలకు, తిరిగి సాయంత్రం 4 గంటలకు ఫేస్ యాప్ వేయాలి. అలాగే వచ్చిన వెంటనే పిల్లల హాజరు ఫొటో తీయాలి. ఎంత మంది హాజరైతే అంత మంది చిన్నారులకు మాత్రమే ఆహారం అందించాల్సి ఉంది. మూడేళ్లల్లోపు చిన్నారులు కావడంతో జిల్లాలోని చాలా అంగన్‌వాడీ కేంద్రాల్లో ఉదయం 10.30 గంటల వరకు పిల్లలు వస్తూనే ఉంటారు. ముందుగానే యాప్ నమోదు చేసిన కారణంగా తర్వాత వచ్చిన పిల్లలకు ఆహారం అందించేందుకు అవకాశం లేకపోవడంతో వండిన ఆహారాన్నే అందరికి సరిపెట్టాల్సిన పరిస్థితులు నెలకొంటున్నాయి. ఈ సమస్యను అధికారుల ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా పరిష్కారం కావడం లేదని అంగన్‌వాడీలు వాపోతున్నారు.

జిల్లా సమాచారం

అంగన్‌వాడీ కేంద్రాలు	2420
మొత్తం కార్యకర్తలు	2420
పర్యవేక్షకులు	70 మంది
సీడీపీఓలు	12 మంది

వేతనాల్లో కోత..

అంగన్‌వాడీ కార్యకర్తల వేతనానికి ఫేస్ యాప్‌తో ముడి పెట్టారు. ఫేస్ యాప్ వేసిన రోజుకు మాత్రమే వేతనం వస్తోంది. సాంకేతిక సమస్య తలెత్తి ఆ రోజు యాప్‌లో నమోదు కాకపోతే వేతనం కట్ అవుతోంది. ప్రభుత్వం కోరిన సమాచారాన్ని యాప్‌ల ద్వారా ఇవ్వడం, రికార్డులు రాయడం, టేక్‌హోం రేషన్ పంపిణీ, ప్రతి నెలా 1వ తేదీ నుంచి 5వ తేదీ వరకు పిల్లల బరువు పరిశీలించడం వంటి విధులు నిర్వహిస్తున్నారు. ఇవే కాకుండా ఇతర ప్రభుత్వ కార్యక్రమాలకు హాజరు కావాలని తమపై పనిభారం మోపుతున్నారని ఆందోళన చెందుతున్నారు. ప్రతి నెలా రూ.11,500 గౌరవ వేతనంతో నెలంతా తమతో వెట్టి చాకిరి చేయిస్తున్నారని మండి పడుతున్నారు. కేంద్రాలను శుభ్రం చేయడం, ప్రీ స్కూల్ విద్యార్థులకు పోషకాహారం వండి పెట్టడం, వంటపాత్రలు కడగటం, పిల్లల వాష్‌రూం శుభ్రం చేయడం వంటి పనులు చేస్తున్నవారికి నెలకు కేవలం రూ.7 వేలు మాత్రమే ఇస్తున్నారు.



సెల్‌ఫోన్లు వెనక్కి తీసుకుని 5జీ ట్యాబ్‌లు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్న అంగన్‌వాడీలు

పనిచేయని ఫోన్లతో ఇబ్బందులు




ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టిన బాలసంజీవని యాప్ సక్రమంగా పనిచేయడం లేదు. ప్రస్తుతం ఉన్న ఫోన్లలో యాప్ ఇన్‌స్టాల్ అయినా సర్వర్లు మొరాయిస్తుండటంతో వివరాలు నమోదు చేసేందుకు గంటల తరబడి వేచి ఉండాల్సి వస్తోంది. గ్రామీణ ప్రాంతాల్లో ఇంటర్నెట్ సదుపాయం అంతంత మాత్రంగానే ఉంది. నెట్ లేకపోతే యాప్ ఓపెన్ కావడం లేదు. – విజయ, సీఐటీయూ అధ్యక్షురాలు, కార్వేటినగరం ప్రాజెక్టు, శ్రీరంగరాజపురం

ట్యాబ్‌లు పంపిణీ చేయాలి



బాలసంజీవని 2.0 యాప్‌తో అంగన్‌వాడీలు ఇబ్బందులు పడుతున్నారు. గతంలో ఇచ్చిన మొబైల్ ఫోన్లలో ఈ యాప్ పనిచేయడం లేదు. పాత ఫోన్లను వెనక్కు తీసుకుని ఆ స్థానంలో 5జీ ట్యాబ్‌లు పంపిణీ చేసి అంగన్‌వాడీలకు యాప్ కష్టాలు తొలగించాలి. యాప్‌ల నిర్వహణతో అంగన్‌వాడీ కేంద్రాల్లో అంగన్‌వాడీలు పడుతున్న అవస్థలు తొలగించాలి. – మమత, సీఐటీయూ ప్రధాన కార్యదర్శి, కార్వేటినగరం ప్రాజెక్టు, కార్వేటినగరం

పనిభారం తగ్గించాలి



అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలపై పనిభారం అధికమైంది. కేంద్రాల్లో యాప్‌ల నిర్వహణతో సతమతమవుతున్నారు. ఈ పనులే కాకుండా ఇతర ప్రభుత్వ కార్యక్రమాలకు హాజరు కావాలని ఒత్తిళ్లు చేస్తున్నారు. అరకొర వేతనం ఇస్తూ అంగన్‌వాడీలతో వెట్టి చాకిరి చేయించడం సరికాదు.అంగన్‌వాడీలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంతో పాటు వారిపై పనిభారం తగ్గించకుంటే రాబోయే రోజుల్లో ఆందోళనలు చేపడుతాం. – వాడ గంగరాజు, సీఐటీయూ జిల్లా గౌరవాధ్యక్షుడు, చిత్తూరు

ఫిజికల్ వెరిఫికేషన్‌కు హాజరుకావాలి

చిత్తూరు కలెక్టరేట్ : ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలోని టీచర్లు సాధారణ బదిలీల్లో మెడికల్ గ్రౌండ్స్‌లో ప్రెపరెన్షియల్ కేటగిరీకి దరఖాస్తు చేయాలనుకుంటే ఫిజికల్ వెరిఫికేషన్ కు హాజరుకావాలని చిత్తూరు డీఈఓ వరలక్ష్మి తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆమె విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర విద్యాశాఖ ఆదేశాల మేరకు ప్రెపరెన్షియల్ కేటగిరీ టీచర్లు ఈనెల 24వ తేదీ నుంచి 26వ తేదీ వరకు తిరుపతి జిల్లా కేంద్రం రుయాలో నిర్వహించే ఫిజికల్ వెరిఫికేషన్ కు హాజరుకావాలన్నారు. ప్రెపరెన్షియల్ కేటగిరిలో దరఖాస్తు చేసుకోవాలనుకునే టీచర్లు సంబంధిత డీడీవోలు నిర్దేశించిన నమూనాలో తగిన ఆధారాలు జత చేసి తిరుపతి డీఈఓ కార్యాలయంలో ఈనెల 23వ తేదీలోపు అందజేయాలని కోరారు.

పెనుమూరు..గంజాయి జోరు

- దాణా పేరుతో విచ్చలవిడిగా అమ్మకాలు
- చీకటి పడితే బీడు భూముల్లో ముఠాలు
- పక్క రాష్ట్రాల నుంచి యథేచ్ఛగా దిగుమతి
- నిద్ర మత్తులో అధికారులు



పెనుమూరు మండల కేంద్రం

సాక్షి టాస్క్‌ఫోర్స్ : గంజాయి, మట్కా, గుట్కా వంటి అసాంఘిక కార్యకలాపాలకు పెనుమూరు మండల కేంద్రం నిలయంగా మారింది. మత్తుకు యువత బానిసలై తమ నిండు జీవితాలను నాశనం చేసుకుంటున్నారు. పెనుమూరు మండల కేంద్రంలో కొన్ని నెలలుగా గంజాయి అమ్మకాలు జోరందుకున్నాయి. కొందరు దాణా వ్యాపారం పేరుతో గంజాయి అమ్మకాలు చేస్తూ చాపకింద నీరులా తమ అక్రమ వ్యాపార సామ్రాజ్యాన్ని విస్తరింపజేసుకుంటున్నారు. అలాగే కొన్ని నిత్యావసర సరుకుల దుకాణాల్లో గంజాయి అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి. పెనుమూరు మండల కేంద్రం చుట్టూ ఉన్న బీడు భూముల్లో చీకటి పడితే చాలు గంజాయి కేంద్రాలుగా మార్చేస్తున్నారు. మహిళలు బహిర్భూమికి వెళ్లాలంటే భయభ్రాంతులకు గురవుతున్నారు. చిత్తూరు జిల్లాకు సమీపంలో తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలు ఉండడంతో అక్రమ వ్యాపారులు కొందరు ప్రయాణికుల్లా ఎవరికీ అనుమానం లేకుండా చేతి సంచులు, కట్టి బ్యాగుల్లో రహస్యంగా ఆర్టీసీ బస్సుల్లో తెచ్చుకుంటున్నట్లు సమాచారం. ఎక్కువగా కర్ణాటక రాష్ట్రం నుంచి దిగుమతి చేసుకుంటున్నట్లు స్థానికులు చెబుతున్నారు. గంజాయి మత్తుకు బానిసలైన యువత, విద్యార్థులు తమ బంగారు భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారని తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. దుకాణాల్లో తనిఖీలు లేకపోవడంతో అక్రమ వ్యాపారాలు యథేచ్ఛగా సాగిస్తున్నారు. అక్రమ వ్యాపారులు గంజాయితో రూ.లక్షలు గడిస్తూ పెనుమూరును గంజాయి వ్యాపారానికి కేంద్రంగా మారుస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు నిద్రమత్తును వీడి గంజాయి అమ్మకాలపై దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ఆర్భాట డీఎస్సీ!

సీఎం చంద్రబాబు.. డీఎస్సీ తొలి సంతకానికే దాదాపు 11 నెలలు సాగదీశారు.. ఇక నిరుద్యోగ అభ్యర్థుల ఒత్తిడి తాళలేక ఎట్టకేలకు బాబు జన్మదిన కానుకగా డీఎస్సీ నోటిఫికేషన్ ఇచ్చారు. కాగా పరీక్ష ఎప్పుడూ ఒకే రోజు నిర్వహించే డీఎస్సీని ఇప్పుడు నెల రోజులు నిర్వహించేలా మెలిక పెట్టారు. ఎందుకు ఇలా చేశారంటే.. ప్రజాధనాన్ని ప్రైవేటు సంస్థలకు దోచిపెట్టడం కోసమే ఇలా జరిపిస్తున్నారనే విమర్శలు లేకపోలేదు. కాగా కనీసం అయిదు మాసాలు ఉచిత డీఎస్సీ శిక్షణ ఇవ్వాల్సిన ప్రభుత్వం కేవలం ప్రచార ఆర్భాటానికే పరిమితం కావడంపై అభ్యర్థులు మండిపడుతున్నారు.

- బాబు జన్మదిన కానుకగా నోటిఫికేషన్
- దళితులకు, బీసీలకు ఇచ్చే ఉచిత శిక్షణపై మండిపాటు
- తొలిసారిగా సీబీటీ విధానంలో పరీక్షలంటూ మెలిక
- జిల్లాలో 1,478 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్



డీఎస్సీ పరీక్షకు ప్రైవేట్ సెంటర్ లో శిక్షణ పొందుతున్న నిరుద్యోగులు

చిత్తూరు కలెక్టరేట్ : అధికారంలోకి రాగానే డీఎస్సీ పరీక్షను నిర్వహిస్తామంటూ గత ఎన్నికల సమయంలో టీడీపీ హామీ ఇచ్చింది. అధికారంలోకి వచ్చాక సీఎంగా ప్రమాణ స్వీకారం రోజున చంద్రబాబు మెగా డీఎస్సీ పరీక్ష ఫైల్‌పై తొలి సంతకం చేశారు. అయితే పరీక్షల నోటిఫికేషన్ జారీ చేయకుండా నెలల తరబడి సాగదీశారు. చివరికి క్షేత్ర స్థాయిలో నిరుద్యోగుల నుంచి తీవ్ర స్థాయిలో విమర్శలు చెలరేగాయి. తాజాగా ఈనెల 20న చంద్రబాబు జన్మదినాన్ని పురస్కరించుకుని ఆర్భాటంగా నోటిఫికేషన్‌ను మంత్రి లోకేష్ విడుదల చేశారు. కాగా సీబీటీ విధానంలో పరీక్షలు నిర్వహిస్తామంటూ మెలిక పెట్టడంతో అభ్యర్థులు ఆందోళనకు గురయ్యారు.

నిధులను కాజేసేందుకేనా..

సీబీటీ విధానంలో పరీక్షలు నిర్వహించాలంటే అందుకు సరిపడే సౌకర్యాలు రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ కేంద్రాల్లో లేవు. ప్రత్యామ్నాయంగా ప్రైవేట్ ఇంజినీరింగ్, మరికొన్ని కంప్యూటర్ కేంద్రాలపై ఆధారపడాల్సిన పరిస్థితి ఉంటుంది. ప్రైవేట్ కేంద్రాల్లో సీబీటీ విధానంలో డీఎస్సీ పరీక్షల నిర్వహణకు రూ.కోట్ల కొద్దీ బిల్లులు చెల్లించాల్సి వస్తుంది. అదే పాత విధానంలో ఒకే రోజు డీఎస్సీ పరీక్షను ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల కేంద్రాల్లో నిర్వహిస్తే ప్రభుత్వానికి తక్కువ ఖర్చుతో సరిపోయేది. అలా కాకుండా డీఎస్సీ పరీక్షను నెల రోజుల పాటు ఇంజినీరింగ్ కళాశాలల్లో నిర్వహించి నిధులను నొక్కేసేందుకు ప్రణాళిక రచించినట్లు విమర్శలున్నాయి.

పరీక్షలు నెలరోజులా..

డీఎస్సీ పరీక్షను ఈసారి తొలిసారిగా సీబీటీ (కంప్యూటర్ బేస్డ్ టెస్ట్) విధానంలో నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని నోటిఫికేషన్‌లో తెలియజేశారు. సీబీటీ విధానం ప్రకారం పరీక్షలను నెల రోజుల పాటు నిర్వహించనున్నారు. గతంలో ఒక్క రోజులోనే డీఎస్సీ పరీక్షను రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించేవారు. ఉద్దేశపూర్వకంగా ఏదో ఒక మెలిక పెట్టాలనే ఇలా నిర్వహిస్తున్నారని అభ్యర్థులు ఆరోపిస్తున్నారు.

ఉమ్మడి జిల్లాలో 1,478 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్

ఉమ్మడి చిత్తూరు జిల్లా ప్రకారం డీఎస్సీ నోటిఫికేషన్ జారీ చేశారు. ఉమ్మడి జిల్లాలోని 14 అసెంబ్లీ నియోజకవర్గాల్లోని పాఠశాలల్లో వివిధ కేడర్‌లలో 1,473 పోస్టులను భర్తీ చేయనున్నారు. అధికంగా ఎస్జీటీ పోస్టులు 979 పోస్టులను భర్తీ చేయనున్నారు. మిగిలిన స్కూల్ అసిస్టెంట్ కేడర్‌లో 499 పోస్టులను భర్తీ చేయనున్నట్లు నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు. ఏప్రిల్ 20వ తేదీ నుంచి మే 15వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పించారు.

మొక్కుబడిగా ఉచిత శిక్షణలు

డీఎస్సీ పరీక్షకు ఉచిత కోచింగ్ హామీ ప్రకారం నోటిఫికేషన్‌కు కనీసం అయిదు నెలల ముందు శిక్షణ ఇచ్చి ఉంటే నిరుద్యోగులకు ఉపయోగం ఉండేది. ఉచిత కోచింగ్ అంటూ ప్రచారం చేసిందే తప్ప శిక్షణ ఇచ్చిన పాపాన పోలేదు. బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ ప్రారంభించినప్పటికీ 5 మంది అభ్యర్థులు కూడా లేరు. ఎస్సీ అభ్యర్థులకు ఇటీవలే శిక్షణ ప్రారంభించారు. శిక్షణ కేంద్రాల్లో నైపుణ్యం కలిగిన అధ్యాపకులు లేకపోవడంతో అభ్యర్థులు ఉచిత శిక్షణ పై నమ్మకం లేక ప్రైవేట్ కేంద్రాలను ఆశ్రయిస్తున్నారు. ఉచిత శిక్షణ లోనూ ప్రభుత్వం నిరుద్యోగులను మోసగించింది.

డీఎస్సీ నోటిఫికేషన్ ప్రకారం పోస్టుల వివరాలు

స్కూల్ అసిస్టెంట్ ల్యాంగ్వేజ్–1	38
స్కూల్ అసిస్టెంట్ హిందీ	17
స్కూల్ అసిస్టెంట్ ఇంగ్లీష్	104
స్కూల్ అసిస్టెంట్ గణితం	30
స్కూల్ అసిస్టెంట్ ఫిజిక్స్	29
స్కూల్ అసిస్టెంట్ బయాలజీ	63
స్కూల్ అసిస్టెంట్ సోషియల్	130
స్కూల్ అసిస్టెంట్ ఫిజికల్ ఎడ్యుకేషన్	86
ఎస్జీటీ	976
ట్రైబల్ వెల్ఫేర్ ఆశ్రమం గణితం	01
ట్రైబల్ వెల్ఫేర్ ఆశ్రమం ఫిజిక్స్	01
ట్రైబల్ వెల్ఫేర్ ఆశ్రమం బయాలజీ	01
ట్రైబల్ వెల్ఫేర్ ఆశ్రమం ఎస్జీటీ	02
మొత్తం పోస్టులు	1,478

ఉమ్మడి చిత్తూరు జిల్లా సమాచారం

ప్రాథమిక పాఠశాలలు	3,766
ప్రాథమికోన్నత పాఠశాలలు	444
ఉన్నత పాఠశాలలు	705

దళితులను మోసగించింది



ఉచిత డీఎస్సీ శిక్షణ ఇస్తామంటూ కూటమి ప్రభుత్వం దళితులను మోసగించింది. దూర ప్రాంతాల్లో శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేసి రొడ్డెక్కేలా చేసింది. ప్రణాళిక ప్రకారం ఎస్సీ నిరుద్యోగులకు ఇవ్వాల్సిన ఉచిత డీఎస్సీ కోచింగ్ ఇప్పించడంలో ప్రభుత్వం విఫలమైంది. – నాగరాజు, సీపీఐ జిల్లా కార్యదర్శి

ఇబ్బంది పెట్టడం సరికాదు



డీఎస్సీ నిరుద్యోగులను ప్రభుత్వం ఇబ్బంది పెట్టడం సరికాదు. ప్రమాణ స్వీకారం రోజున సంతకం చేశారు. నోటిఫికేషన్ ఇచ్చేందుకే పది నెలలకు పైగానే సమయం పట్టింది. అభ్యర్థులకు ఇచ్చిన మాట ప్రకారం ఎస్సీ, ఎస్టీ, బీసీ ఉచిత శిక్షణ సక్రమంగా ఇచ్చారా అంటే అదీ లేదు. – శివారెడ్డి, ఏఐఎస్ఎఫ్ జాతీయ కార్యదర్శి

ఇంత కక్కుర్తా.. హుస్సేన్

- చర్చనీయాంశంగా తహసీల్దార్ ఏసీబీ కేసు



ఏసీబీకి చిక్కిన ఇన్‌చార్జి తహసీల్దార్ హుస్సేన్

చిత్తూరు కలెక్టరేట్ : రైతు నుంచి రూ.1.50 లక్షలు డిమాండ్ చేసి రూ.75 వేలు లంచం తీసుకుంటూ సదుం మండల ఇన్‌చార్జి తహసీల్దార్ మారుఫ్ హుస్సేన్ ఏసీబీ వలలో చిక్కిన విషయం విదితమే. ఆయన అయిదుగురు కలెక్టర్‌ల వద్ద సీసీగా విధులు నిర్వహించారు. 2018లో అప్పటి కలెక్టర్, ప్రస్తుతం సీఎం సెక్రటరీ పీఎస్ ప్రద్యుమ్న, నారాయణ భరత్ గుప్తా, హరినారాయణన్, షణ్మోహన్, ప్రస్తుత కలెక్టర్ సుమిత్ కుమార్ వద్ద సీసీ (క్యాంప్ క్లర్క్) గా ఏడున్నర సంవత్సరం పాటు విధులు నిర్వర్తించారు. ఆయనకు జిల్లాలోని వివిధ శాఖల్లో విధులు నిర్వర్తిస్తున్న జిల్లా అధికారులతో పాటు, సెకండ్ కేడర్ అధికారులంతా సుపరిచితమే. అంతేకాకుండా జిల్లా స్థాయి కేడర్ నుంచి రాష్ట్ర స్థాయి కేడర్ లోనూ పలుకుబడి పెట్టుకున్నారు. ఆరుగురు కలెక్టర్‌ల వద్ద క్యాంప్ క్లర్క్ గా విధులు నిర్వర్తించిన హుస్సేన్ లంచానికి కక్కుర్తి పడి ఏసీబీకి దొరకడం విమర్శలకు తావిస్తోంది. ప్రస్తుతం ఈ విషయం జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ శాఖల్లో చర్చనీయాంశంగా మారింది.

రెవెన్యూ అసోషియేషన్ జిల్లా అధ్యక్షులుగా..

ఏసీబీకి చిక్కిన సదుం ఇంచార్జి తహసీల్దార్ హుస్సేన్ జిల్లా రెవెన్యూ అసోషియేషన్ అధ్యక్షుడిగా ఉన్నారు. ఉన్నతమైన పదవిలో ఉన్న ఆయన లంచానికి కక్కుర్తి పడి ఏసీబీకి చిక్కడం రెవెన్యూశాఖతో పాటు ఆ సంఘానికి మాయని మచ్చని తీసుకొచ్చింది. కలెక్టరేట్‌లో ఏ ఇద్దరు ఉద్యోగులు కలిసినా ఈ అంశంపైనే చర్చించుకుంటున్నారు. సదుం ఇన్‌చార్జి తహసీల్దార్ ఏసీబీకి చిక్కడంతో అధికారులు కలెక్టరేట్‌కు నివేదికలు పంపిన వెంటనే ఆయనను సస్పెండ్ చేసి మరొకరిని ఇన్‌చార్జి తహసీల్దార్ గా నియమించనున్నారు.

క్లుప్తంగా

అగ్నిప్రమాదంలో ఇల్లు దగ్ధం

– రూ.3 లక్షల ఆస్తి నష్టం



రోదిస్తున్న బాధితురాలు సుకన్య, ఆమె పిల్లలు

పుత్తూరు : మండల పరిధిలోని కృష్ణసముద్రంలో ఆదివారం తెల్లవారుజామున జరిగిన అగ్ని ప్రమాదంలో ఓ ఇల్లు పూర్తిగా దగ్ధమైంది. గ్రామస్తుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన సుకన్య పెంకుటింటిలో నివాసం ఉంటోంది. ఆదివారం తెల్లవారుజామున ఇంటిలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగి నిమిషాల వ్యవధిలో ఇల్లు పూర్తిగా మంటలు వ్యాపించాయి. పుత్తూరు నుంచి అగ్నిమాపక వాహనం వచ్చేలోపే ఇల్లు పూర్తిగా దగ్ధమైంది. ఈ అగ్ని ప్రమాదంలో రూ.3 లక్షలు విలువైన వస్తువులు, ఇంటి సామగ్రి, 4 సవర్ల బంగారు నగలు పూర్తిగా దగ్ధమయ్యా యి. సుకన్య తన ఇద్దరు పిల్లలు కట్టుబట్టలతో రోడ్డున పడ్డారు. సుకన్య కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

నాటు బాంబు పేలి యువతికి గాయాలు



యువతి చేతికి గాయాలు

గంగాధర నెల్లూరు : నాటుబాంబు పేలి యువతికి గాయాలైన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గంగాధర నెల్లూరు మండలం తూగుంద్రం పంచాయతీ అవల కొండ గ్రామానికి చెందిన కమ్రతాజ్ శనివారం తన పొలంలో కొబ్బరి కాయలు కోస్తుండగా అడవి జంతువుల వేట కోసం గుర్తు తెలియని వ్యక్తులు పెట్టిన నాటు బాంబుపేలి చేయి, కాలికి గాయాలయ్యాయి. వెంటనే జీడీ నెల్లూరులో ఒక ప్రైవేటు వైద్యుడి వద్ద చికిత్స తీసుకున్నట్లు కుటుంబికులు తెలిపారు. ఈ ఘటనపై సంబంధిత అధికారులు పంట పొలాల్లో నాటు బాంబులు పెడుతున్న వ్యక్తులను గుర్తించి చర్యలు తీసుకోవాలని బాధితులు కోరుతున్నారు.



> 'తిరుపతికి చెందిన రవిచంద్ర పేరొందిన ఇంజినీరింగ్ కళాశాలలో గత ఏడాది బీటెక్ పూర్తి చేశాడు. ఎలాగైనా అమెరికాలోని యూనివర్సిటీ ఆఫ్ సౌతర్న్ కాలిఫోర్నియాలో పీజీ చేయాలన్న చిరకాల కోరికతో ఏడాది కాలం ఆర్థిక వనరులతోపాటు వీసా ప్రయత్నాలు చేసుకుని సన్నద్ధమయ్యాడు. ఈ ఏడాది ఎఫ్1 వీసాకు దరఖాస్తు చేసుకుని ఎంతో ఖర్చు పెట్టాడు. కానీ నిరాశ మిగిలింది. వీసాకు అనర్హుడంటూ ఈమెయిల్ ద్వారా సమాచారం అందింది. దీంతో పీజీ సెట్‌కు దరఖాస్తు చేసి ప్రిపరేషన్ మొదలు పెట్టాడు.'

విదేశీ విద్య నేటి విద్యార్థుల కల. ట్రంప్ కఠిన నిబంధనలు..వీసాలపై ఆంక్షలు.. అనర్హులని తిరస్కరణ.. పార్ట్‌టైమ్ ఉద్యోగాలకు అవకాశాలలేమి.. ఆర్థిక సమస్యలు.. ఇంత కష్టపడినా విద్యకు దక్కని భరోసాతో అది యువతకు ఎండమావిగా మారింది. వెరసి.. విద్యార్థిలోకం విదేశీ విద్య వద్దు... స్వదేశీ విద్యే ముద్దు అంటూ రాష్ట్రంలోని యూనివర్సిటీల్లో పలు కోర్సులు చేయడానికి మొగ్గు చూపుతోంది. ఫలితంగా పలు ప్రవేశపరీక్షలకు దరఖాస్తుల సంఖ్య పదిరెట్లు పెరిగింది.

స్వదేశీ విద్యారాగం

- విదేశీ విద్యపై మొగ్గు చూపని యువత
- ట్రంప్ కఠిన నిబంధనలతో విద్యార్థిలోకం బెంబేలు
- పీజీ ప్రొఫెషనల్ కోర్సులకు దరఖాస్తుల వెల్లువ
- ఐసెట్, ఏపీఈసెట్‌కు పదిరెట్లు పెరిగిన అప్లికేషన్లు

తిరుపతి సిటీ: ట్రంప్ అన్నంత పని చేశాడు..స్టూడెంట్స్ వీసాలపై కఠిన నిబంధనలు విధించడంతోపాటు యూఎస్ఏలో విద్యనభ్యసిస్తున్న ఇండియన్ విద్యార్థులపై ఆంక్షలు విధించి ఇంటికి పంపుతున్నాడు. దీంతో 2025–2026 విద్యాసంవత్సరంలో విదేశాల్లో ఉన్నత విద్యనభ్యసించాలని కలలు కన్న తెలుగు విద్యార్థుల ఆశలు అడియాసలయ్యాయి. దీంతో స్వదేశీ విద్యకు డిమాండ్ పెరిగింది. ఇటీవల రాష్ట్రంలోని పలు వర్సిటీలు పీజీ కోర్సుల్లో ప్రవేశాలకు నోటిఫికేషన్లు విడుదల చేశాయి. దీంతో పీజీ కోర్సులకు దరఖాస్తు చేసేందుకు విద్యార్థులు ఎగబడుతున్నారు. గత ఏడాదికంటే పీజీ సెట్లకు దరఖాస్తులు పదిరెట్లు పెరిగాయి.

విదేశీ విద్యపై మొగ్గు చూపని విద్యార్థులు

తిరుపతి జిల్లా నుంచి గత ఏడాది విదేశీ విద్య కోసం సుమారు 9,871 మంది ఎఫ్1 వీసా కోసం దరఖాస్తు చేసుకోగా ఇందులో 6,245 మంది విద్యార్థులు అమెరికా, కెనడా, యూకే, ఆస్ట్రేలియాల్లోని పలు వర్సిటీలలో వీసా సాధించి ఉన్నత విద్యనభ్యసిస్తున్నారు. కానీ ఈ ఏడాది జిల్లా వ్యాప్తంగా కేవలం ఇప్పటివరకు ఎఫ్1 వీసా కోసం కేవలం 761 మంది విద్యార్థులు మాత్రమే దరఖాస్తు చేసుకున్నట్లు విశ్వసనీయ సమాచారం.

ఎఫ్1 వీసాల ఆంక్షలతో వెనుకడుగు

ప్రధానంగా ఇంటర్, డిగ్రీ, బీటెక్ పూర్తి చేసిన విద్యార్థులు ఆర్థిక స్తోమత అంతంతమాత్రంగా ఉన్నా అమెరికాలో ఎంఎస్, ఎంటెక్, మెడికల్, పీజీ కోర్సులు చేయాలనే ఆశతో ఎన్నో ప్రయత్నాలు చేస్తున్నారు. కానీ ట్రంప్ విద్యార్థుల ఆశలపై నీళ్లు చల్లారు. కఠిన నిబంధనలు విధించడంతో జిల్లాలో ఈ ఏడాది విదేశాల్లో విద్యాభ్యాసానికి వీసాలకు దరఖాస్తు చేసుకున్న వారు 40 శాతం కూడా లేదని అమెరికన్ రాయబార కార్యాలయం తేల్చిచెప్పడం గమనార్హం. దరఖాస్తు చేసుకున్న వారిలోనూ 50 శాతం మంది విద్యార్థులను పలు సాకులు చూపించి (ఎఫ్1) స్టూడెంట్ వీసాలకు అర్హులు కాదని ముద్ర వేస్తున్నారు. ఇంటర్వ్యూల్లో ప్రతిభ చూపి వీసా కచ్చితం అనుకున్న విద్యార్థులకు సైతం ఏదో రూపంలో వీసాకు అన్‌ఫిట్ అంటూ ముద్రవేస్తున్నారు. దీంతో విదేశీ విద్యపై విద్యార్థులు వెనుకడుగువేస్తున్నారు.

ప్రొఫెషనల్ కోర్సులకు దరఖాస్తుల వెల్లువ

జిల్లాలోని పలు యూనివర్సిటీల్లో ప్రొఫెషనల్ కోర్సులకు డిమాండ్ పెరుగుతోంది. ఐసెట్, ఏపీఈసెట్, పీజీసెట్‌లకు దరఖాస్తులు వెల్లువెత్తుతున్నాయి. గత ఏడాది ఏపీఈసెట్‌కు 3వేలకు మించని దరఖాస్తులు ఈ ఏడాది 30 వేల పైచిలుకు వచ్చాయి. దీంతోపాటు ఎంబీఏ, ఎంసీఏ కోర్సులకు నిర్వహించనున్న ఐసెట్‌కు సైతం అదే తరహాలో దరఖాస్తులు వస్తున్నట్లు తెలుస్తోంది. ఉన్నత విద్యకు ఈ ఏడాది ఎస్వీయూ, మహిళా వర్సిటీల్లో పోటీ ఎక్కువగా ఉంటుందని, కటాఫ్ మార్కులు సైతం ఊహించని రీతిలో ఉంటాయని విద్యావేత్తలు, మేధావులు అభిప్రాయపడుతున్నారు.

స్థానిక వర్సిటీల్లో అడ్మిషన్లు పెరిగే అవకాశం



విదేశీవిద్యకు ఆంక్షలు విధించడంతో స్వదేశంలోనే ఉన్నత విద్యనభ్యసించేందుకు విద్యార్థులు మొగ్గు చూపుతున్నారు. ఈ ఏడాది పీజీ సెట్లకు సైతం పెద్ద సంఖ్యలో దరఖాస్తులు వస్తున్నాయి. ప్రధానంగా ప్రొఫెషనల్ కోర్సుల్లో ఈ ఏడాది విద్యార్థుల సంఖ్య పెరిగే అవకాశం ఉంది. మెరిట్ స్టూడెంట్లు స్వదేశీ విద్యనభ్యసిస్తే విద్యారంగంలో పరిశోధనలు కొత్త పుంతలు తొక్కే అవకాశం ఉంటుంది. ఎస్వీయూలో కొత్తగా ప్రవేశ పెట్టిన ఎంఎస్ డేటా అనలాసిస్, ఏఐ వంటి కోర్సులతోపాటు ఎంబీఏ, ఎంసీఏలోనూ అడ్మిషన్లు పెరిగే అవకాశం ఉంది.

–సీహెచ్ అప్పారావు, వీసీ, ఎస్వీయూ

ఎన్ఈపీతో ఉద్యోగావకాశాలు మెండు



నూతన విద్యావిధానంతో విద్యార్థులకు ఉద్యోగావకాశాలు మెండుగా ఉంటాయి. విదేశీ విద్యతో సమానంగా స్వదేశంలోనూ పలు వర్సిటీల్లో ప్రొఫెషనల్ కోర్సుల్లో అంతర్జాతీయ స్థాయి సిలబస్ అమలులో ఉంది. రూ.లక్షలు ఖర్చు పెట్టి విదేశీ విద్య కోసం ప్రయత్నించడం కంటే ఎన్ఈపీ విధానం అమలులో ఉన్న వర్సిటీల్లో ఉన్నత విద్యనభ్యసించడం ఎంతో ఉత్తమం. ఇండియన్ నాలెడ్జ్ సిస్టమ్ మెరుగుపడడంతో విద్యార్థులు విదేశాలకు వెళ్లాల్సిన అవసరం లేదు. ఎఫ్1 వీసా కఠినతరంతో ఈ ఏడాది వర్సిటీల్లో అన్ని పీజీ కోర్సులకు అడ్మిషన్లు పెరగనున్నాయి.

–ప్రొఫెసర్ పద్మావతమ్మ, ప్రిన్సిపల్, సైన్స్ కళాశాల, ఎస్వీయూ

పీజీసెట్‌లకు పెరుగుతున్న దరఖాస్తులు



పీజీ సెట్ పరీక్షలకు గత ఏడాది కంటే ఈసారి దరఖాస్తుల సంఖ్య పెరుగుతోంది. ట్రంప్ ఎఫెక్ట్ విదేశీ విద్యపై పెద్ద ప్రభావం చూపుతోంది. పీజీ ప్రొఫెషనల్ కోర్సులకు ఇప్పటికే ఊహించని రీతిలో దరఖాస్తులు వస్తున్నాయి. ఏపీ ఈ సెట్ గడువు ముగిసింది. గత ఏడాది 3,500 దర ఖాస్తులు రాగా ఈ ఏడాది 35 వేలకు మించడం ఊహించని పరిణామం.

–ప్రొఫెసర్ సురేంద్ర బాబు, కో కన్వీనర్, ఏపీ పీజీసెట్, ఎస్వీయూ

ఐసెట్‌కు దరఖాస్తు చేశా..



యూఎస్‌లో ఎంఎస్ చేయాలన్నది నా కల. కానీ ట్రంప్ ఆంక్షలతో భయమేస్తోంది. అక్కడ చదువుతున్న మా బంధువుల పిల్లలు సైతం ఇక్కడికి రావదని చెబుతున్నారు. దీంతో మా తల్లిదండ్రులు వెనుకడుగు వేస్తున్నారు. ప్రస్తుతం ఎంసీఏ చేయడం కోసం ఐసెట్‌కు దరఖాస్తు చేశా. ఇక్కడే మంచి వర్సిటీలో ఎంసీఏలో చేరి పేరొందిన పరిశ్రమలో ఉద్యోగం సాధిస్తా.

–ప్రియాంక, విద్యార్థిని, తిరుపతి

అమెరికా ఆశలపై నీళ్లు చల్లారు



తిరుపతిలో బీటెక్ పూర్తి చేశా. అమెరికాలో ఎంఎస్ చేయాలనే కోరిక ఉండేది. అమెరికా వెళ్లి ఎంఎస్ పూర్తి చేసి, అక్కడే గ్రీన్‌కార్డు సాధించాలనే కోరిక ఉండేది. కానీ ట్రంప్ విధించిన ఆంక్షలతో వీసాకు దరఖాస్తు చేసుకున్నా టోఫెల్‌తోపాటు ఇంటర్వ్యూ పూర్తి చేశా. కానీ ఎలిజిబిలిటీ రాలేదు. దీంతో ఎస్వీయూలో ఎంబీఏ చేసేందుకు ఐసెట్‌కు దరఖాస్తు చేసుకున్నా.

–ప్రదీప్‌కుమార్, విద్యార్థి, తిరుపతి

కుక్కల దాడిలో మహిళకు గాయాలు

పుంగనూరు : మండలంలోని మిట్టపల్లె గ్రామానికి చెందిన సరోజమ్మ ఇంటి ముందు పనులు చేసుకుంటుండగా ఆదివారం కుక్కల గుంపు దాడి చేయడంతో తీవ్రంగా గాయపడింది. కుటుంబికులు గమనించి స్థానిక ఏరియా ఆసుపత్రికి తరలించి చికిత్సలు నిర్వహించారు. గ్రామంలో కుక్కలు స్వైరవిహారం చేస్తుండటంతో గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

అలిగి తిరుమలకు చేరుతున్న బాలురు

- అందరూ 15 ఏళ్లలోపు వారే
- అలిపిరి, శ్రీవారి మెట్టు మార్గాల్లో పనులు చేస్తున్న వైనం
- అక్కడే తిని అక్కడే మకాం పెడుతున్న పిల్లలు



పిల్లలు ఎక్కువగా సంచరించే అలిపిరి మెట్లమార్గం

పలమనేరు : పిల్లలు చిన్న చిన్న విషయాలకే తల్లిదండ్రులపై అలిగి ఇంటి నుంచి వెళ్లిపోతున్నారు. తిరుమల కొండ చేరుతున్నారు. తాజాగా పలమనేరు మండలం టి.వడ్డూరుకు చెందిన ఎనిమిదో తరగతి విద్యార్థి బంగారుపాళెం ఎస్సీ హాస్టల్ నుంచి అదృశ్యమయ్యాడు. హాస్టల్ వార్డెన్లు తిరుమలలో పది రోజులు గాలించాల్సి వచ్చింది. ఎట్టకేలకు ఇల్లు చేరాడు. ఇలా ఒక్కరు కాదు ఇద్దరు కాదు వందల మంది పిల్లలు తిరుపతి, తిరుమలలో ఉన్నట్లు తెలుస్తోంది. పలమనేరు సమీపంలోని టి.వడ్డూరు, గొబ్బిళ్లకోటూరు గ్రామాలకు చెందిన 15 ఏళ్లలోపు వారే పదుల సంఖ్యలో తిరుమలలో ఉన్నట్లు తెలిసింది. కొందరు తల్లిదండ్రులు వెతికి పట్టుకొస్తుండగా.. మరికొందరు కొండపైనే చిరువ్యాపారాలు చేస్తున్నట్లు సమాచారం.

మెట్లదారుల్లో చిన్నపాటి అమ్మకాలు

తిరుమలకు వెళ్లే అలిపిరి, శ్రీవారిమెట్టు ప్రాంతాలు పిల్లలకు ఆవాసాలుగా మారాయి. అక్కడ వ్యాపారాలు చేస్తున్న వారు పిల్లలతో పని చేయించుకుని కొంత కమీషన్ ఇస్తున్నారు. ముఖ్యంగా నడకదారుల్లో పచ్చిమామిడి కాయలు, జామకాయలు, వాటర్ బాటిళ్ల విక్రయిస్తున్నారు. మరికొందరు భక్తులకు తిరునామాలు పెట్టి వారిచ్చినంత పుచ్చుకుంటున్నారు. మరికొందరు హోటళ్లలో దినసరి కార్మికులుగా పనిలో ఉంటున్నారు. అక్కడి యాత్రికుల మధ్య ఈ బాలురు ఆలయానికి వెళ్తున్నారా లేదా అక్కడ ఏమి చేస్తున్నారో గుర్తించడం కష్టంగా మారుతోంది. పలమనేరు సమీపంలోని టి.వడ్డూరు, గొబ్బిళ్లకోటూరు, బైరెడ్డిపల్లి, వి.కోట మండలాలకు చెందిన గ్రామాలు, బంగారుపాళెం మండలంలోని కొన్ని గ్రామాల నుంచి పిల్లలు ఎక్కువ మంది తిరుమల కొండపై ఉన్నట్టు తెలుస్తోంది.

రాత్రుళ్లు వీరి ఆవాసాలెక్కడంటే..

ఇంటి నుంచి అలిగి తిరుమల చేరిన పిల్లలు రాత్రిళ్లు సీఆర్వో కార్యాలయం, బాలాజీ బస్టాండు, సీఆర్వో వెనుక వైపునున్న యాత్రికుల వసతి నిలయాలు, కళ్యాణకట్ట ముందున్న ప్రాంతం, హెచ్‌వీటీఎల్ తదితర ప్రాంతాల్లో నిద్రిస్తున్నట్లు సమాచారం. అక్కడి స్నానపు గదులను ఉపయోగించుకోవడం, భక్తులు పెట్టే భోజనాలు తినడం మళ్లీ పగలు పెట్టుబడిలేని చిన్నచిన్న వ్యాపారాలు చేసుకుంటూ గడుపుతున్నారని తెలుస్తోంది. ముఖ్యంగా తల్లిదండ్రులు లేని పిల్లలు, ఎవరూ పట్టించుకోనివారు, తల్లిదండ్రులపై అలిగిన వారు ఇక్కడికి చేరుతున్నట్లు సమాచారం. తిరుమలలో విజిలెన్స్, పోలీసులు పూర్తిస్థాయిలో నిఘా ఉంచితేగాని పిల్లలను పట్టుకోవడం కష్టమే. చదువుకోవాల్సిన వయసులో బాల కార్మికులుగా మారుతున్న చిన్నారులను కాపాడాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

కిక్కిరిసిన బోయకొండ

- పెరిగిన భక్తుల రద్దీ
- ఆలయానికి రూ.11.98 లక్షల ఆదాయం



అలంకరణలో అమ్మవారు

చౌడేపల్లె : కోరిన కోర్కెలు తీర్చే దైవంగా పేరుగాంచిన మండలంలోని బోయకొండ గంగమ్మతల్లి దీవెనల కోసం భక్తులు బోయకొండకు ఆదివారం తరలివచ్చారు. ఆంధ్ర, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల నుంచి వేల మంది భక్తులు అమ్మవారి దర్శనం కోసం వివిధ వాహనాల్లో తరలివచ్చారు. ఒక్క రోజే సుమారు 20 వేల మంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారని అధికారులు వెల్లడించారు. అర్చకులు అమ్మవారిని ప్రత్యేక పూలు, బంగారు ఆభరణాలతో అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. ఆలయంవద్ద భక్తులకు విక్రయించిన వివిధ సేవా టికెట్ల ద్వారా ఆలయానికి రూ.11.98 లక్షల ఆదాయం సమకూరినట్లు ఈఓ ఏకాంబరం తెలిపారు. వీటితో పాటు అన్నదానం నిర్వహణకు రూ.25 వేలు భక్తులు విరాళాలు ఇచ్చారని పేర్కొన్నారు.

కొండంత జనం

తిరుమల: ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రం తిరుమల ఆదివారం తిరుమల భక్తులతో కిక్కిరిసిపోయింది. పదో తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షలు ముగియడంతో శ్రీవారిని దర్శించుకునేందుకు భక్తులు తండోపతండాలుగా తరలివస్తున్నారు. టీటీడీ కూడా దీనికి తగినట్టుగా ఏర్పాట్లు చేపట్టింది. క్యూకాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లు నిండాయి. క్యూలైన్ కృష్ణతేజ అతిథి గృహం వద్దకు చేరింది. శనివారం అర్ధరాత్రి వరకు 78,821 మంది స్వామివారిని దర్శించుకోగా 33,568 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.36 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది.

సెప్టిక్ ట్యాంక్ క్లీన్ చేస్తూ కూలీ మృతి

– మరొకరి పరిస్థితి విషమం



హేమంత్‌ను ఆసుపత్రికి తీసుకొచ్చిన 108 సిబ్బంది

పుంగనూరు: సెప్టిక్ ట్యాంక్ శుభ్రం చేసేందుకు వచ్చిన ఇద్దరు కూలీలు అందులో చిక్కుకుని , ఒకరు మృతి చెందగా మరొకరి పరిస్థితి విషమంగా ఉన్న సంఘటన ఆదివారం చోటుచేసుకుంది. అగ్నిమాపకశాఖ అధికారి సుబ్బరాజు తెలిపిన మేరకు వివరాలు ఇలా.. పట్టణంలోని శాంతినగర్‌లో నివాసం ఉంటున్న యుగంధర్ నాయుడు తన ఇంటి సెప్టిక్ ట్యాంకును శుభ్రం చేసేందుకు మదనపల్లెలోని సంతపేటకు చెందిన హేమంత్, రాయలపాడుకు చెందిన రవి అనే కూలీలను పిలిపించాడు. ఆ ఇద్దరు కూలీలు మధ్యాహ్నం ట్యాంకులోనికి దిగి క్లీన్ చేసే సమయంలో విష వాయువులు ఒక్కసారిగా రావడంతో ఊపిరాడక ట్యాంకులో చిక్కుకున్నారు. దీనిపై యజమాని అగ్నిమాపకశాఖ కార్యాలయానికి , 108కు ఫిర్యాదు చేశారు. తక్షణమే రెండుశాఖల వారు సంఘటన స్థలానికి చేరుకున్నారు. అగ్నిమాపకశాఖ అధికారి సుబ్బరాజు, సిబ్బంది సెప్టిక్ ట్యాంకులో చిక్కుకున్న వారిని తాళ్ల సాయంతో వెలికితీశారు. వారిలో హేమంత్(27) అనే యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. మరో యువకుడు రవి (35)ని 108లో ఏరియా ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతున్నాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.



ధరలు లేక పొలంలోనే వదిలిపెట్టిన బంతిపూలు

బంతిపూలు ధరలు పతనం కావడంతో రైతులు పూలను తోటల్లోనే వదిలిపెడుతున్నారు. ఆరుగాలం శ్రమటోడ్చి పండించిన పూల ధరలు మార్కెట్‌లో అకస్మాత్తుగా పడిపోవడంతో రైతులు లబోదిబోమంటున్నారు. కనీసం పంటకు పెట్టిన పెట్టుబడులు కూడా రావడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏటా బంతిపూలు సాగు చేయడం.. ధరలు పతనం కావడం.. రైతులు బంతిపూల సాగు చేయాలంటేనే హడలిపోయే పరిస్థితులు దాపురించాయి. బంతి పూలు సాగు చేసిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు.

బంతి విలాపం

- బంతిపూల ధరలు నేల చూపు
- పెట్టుబడి ఖర్చులు దక్కని వైనం
- అన్నదాతల ఆవేదన
- అధిక దిగుబడే కారణమంటున్న వ్యాపారులు
- ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్

కుప్పం రూరల్ : కుప్పంలో బంతిపూల ధరలు నేల చూపు చూస్తున్నాయి. రైతులు పెట్టుబడి రాక పూలను తోటల్లోన్నే వదిలిపెడుతున్నారు. కుప్పం మార్కెట్‌లో కిలో రూ.5 నుంచి 10 రూపాయలు పలుకుతున్నాయి. దీంతో రైతులు కోత కూలీ కూడ రాదని ఆవేదన చెందుతున్నారు. కొంత మంది రైతులు ధరలు లేకపోవడంతో మార్కెట్ బయటే పారబోసి వెళ్తున్నారు. మిగిలిన పూల ధరలు ఓ మోస్తరుగా ఉన్నా బంతి పూల ధరలు మాత్రం పతనమయ్యాయి. వ్యాపారులు మాత్రం అధిక దిగుబడే కారణమంటున్నారు.

వివిధ రాష్ట్రాలకు ఎగుమతి

మూడు రాష్ట్రాల కూడలిగా ఉన్న కుప్పానికి పూల సాగులో ప్రత్యేక స్థానం ఉంది. ఇక్కడ పండిన పూలు రాష్ట్రాలు చుట్టి వస్తున్నాయి. ప్రస్తుతం కుప్పం మార్కెట్ నుంచి విజయవాడ, హైదరాబాద్, చెన్నై, బెంగళూరు నగరాలకు ఎగుమతి చేస్తున్నారు. అన్ని రకాల పూల ధరలు ఓ రకంగా ఉన్నా బంతిపూల ధరలు మాత్రం నేలకు దిగిపోయాయి. కుప్పం మార్కెట్‌లో వారం రోజులుగా సరాసరిన కిలో రూ.10 పలుకుతున్నాయి. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. పూలను కోయక తోటల్లోన్నే వదిలిపెడుతున్నారు.

సాగు ఖర్చులు రావడం లేదు..

ఎకరా బంతి సాగు రూ.40 వేలు ఖర్చు అవుతుండగా ప్రస్తుతం ధరలతో కోత కూలీ రావడం లేదని రైతులు వాపోతున్నారు. ఎకరాకు 7,500 మొక్కలను నాటాల్సి ఉంటుంది. ఒక్కో మొక్క ధర రూ.2.50 రూపాయలుగా ఉంది. ఇలా దుక్కులు చేయడం, మొక్కలు నాటడం, ఎరువులు వెరసి ఎకరా సాగుకు రూ.40 వేలు ఖర్చు వస్తోంది. ధరలు పతనం కావడంతో సాగు ఖర్చులు వచ్చే అవకాశం లేదని రైతులు వాపోతున్నారు. మిగిలిన పూలైన చామంతి కుప్పం మార్కెట్‌లో కిలో రూ.150 – 170, రోజా రూ.80–100, కనకాంబరం రూ.600, మల్లె రూ.280– 320, సంపంగి రూ.60, జాజిమల్లె రూ.240 పలికింది. కానీ బంతి మాత్రమే కిలో రూ.5–10 రూపాయలు పలుకుతున్నాయి. అధిక దిగుబడి రావడమే ఇందుకు కారణమని వ్యాపారులు చెబుతున్నారు. కుప్పంలో టమాట తరువాత రైతులు ఎక్కువ మొత్తంలో బంతి పూలు సాగు చేయడం ధరల పతనానికి కారణంగా చెబుతున్నారు.

ప్రభుత్వమే ఆదుకోవాలి

ఎకరాకు 40 వేలు ఖర్చు చేసి బంతిపూలు సాగు చేస్తే కనీసం కూలీ ఖర్చులు కూడా రావడం లేదని అన్నదాతలు ఆవేదన చెందుతున్నారు. బంతిపూల రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు. ఎన్నో ఆశలతో సాగు చేస్తే ధరల రూపంలో ఇలా రైతుల నెత్తిన బండ పడుతోందని వాపోతున్నారు. ప్రతిసారి ఇలాగే జరుగుతుండడంతో రైతులు పూలసాగు వదిలిపెట్టాల్సి వస్తోందని నిరాశ చెందుతున్నారు. బంతి సాగులో నష్టపోయిన రైతులకు ప్రభుత్వం ఎకరాకు కనీసం రూ.20 వేల చొప్పున నష్ట పరిహారం ఇవ్వాలని రైతులు కోరుతున్నారు.



కొనేవారు లేక మార్కెట్‌లో నిలిచిపోయిన బంతిపూలు

సాగు వదులుకోవాల్సిందే..

రూ.40 వేలు పెట్టుబడి పెట్టి 45 రోజుల పాటు ఆరుగాలం కష్టపడి సాగు చేస్తే బంతిపూలు చేతికి వస్తాయి. ఈ మధ్యలో చీడపీడలు ఆశిస్తే పంట చేతికి రాదు. నీరు అందుబాటులో లేకపోయిన మధ్యలోనే పంట నష్టపోవాల్సి ఉంది. పంట చేతికి రాగానే ధరల రూపంలో రైతులకు గుదిబండ పడడంతో రైతులు తీవ్రంగా నష్టపోవాల్సి వస్తోంది. పండుగలు, శుభకార్యాల సమయంలో మాత్రం ఓ మోస్తరుగా ఉంటుంది. మిగిలిన రోజుల్లో బంతి ధరలు అంతగా ఉండడం లేదు. ధరలు ఇలాగే కొనసాగితే రైతులు బంతి సాగును నిలిపివేయాల్సిన పరిస్థితి తలెత్తుతోంది.

– చిన్నప్పకాంతరాజ్, రైతు, పెద్ద బంగారునత్తం